

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసి విన్నవించిన ఎమ్మెల్యే



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

జన్నారం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలో కలమడుగు, జన్నారం, కవ్వాల్ రోడ్ల విస్తరణ కోసం సహకరించాలన్నారు. అదే విధంగా నిర్మల్ జిల్లా లోని బెల్లాల్, ఖానాపూర్, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, గుడిహత్నూర్, హస్నాపూర్, నర్మూర్ రోడ్ల విస్తరణతో పాటు మండలాల అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. రోడ్ల విస్తరణ జరిగితే అభివృద్ధి జరుగుతుందని అన్నారు.

వైన్‌షాపుల టెండర్లకు నోటిఫికేషన్..

- నెలాఖరులో మొదలు కానున్న దరఖాస్తు ప్రక్రియ
- మూడు నెలలు ముందుగానే టెండర్లు ఆహ్వానం
- నవంబర్ నెలాఖరు వరకు పాత లైసెన్స్ గడువు
- 21న లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమలు



మంచిర్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపు టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల లైసెన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. 2025-2027 సంవత్సరానికి గాను ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా, జిల్లా స్థాయిలో అధికారులు మద్యం షాపుల టెండర్ల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, లక్సెట్టిపేట ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గత మద్యం పాలసీ మాదిరిగానే ఈసారి కూడా మొత్తం 73 ఏ4 మద్యం షాపులను ఏర్పాటు చేయనున్నారు. కొత్త లైసెన్స్‌లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసేందుకు అబ్కారీశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

పెరిగిన దరఖాస్తు రుసుము...

మద్యం షాపుల టెండర్లలో పాల్గొనదలిచే వ్యాపారులు గతంలో కంటే అదనంగా దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఒక్కో షాపునకు రూ. 3 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో మద్యం వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఈ సారి కూడా లిక్కర్ వ్యాపారులు దుకాణాల కోసం పోటీపడే అవకాశాలు ఉన్నాయి. మద్యం దుకాణాలకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించేందుకు సిద్ధపడుతుండటంతో దరఖాస్తు చేసేందుకు అవసరమైన సొమ్మును సమకూర్చుకునే పనిలో వ్యాపారులు నిమగ్నమయ్యారు. వ్యాపారులు కొంత మంది కలిసి సిండికేటుగా ఏర్పడి ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు చేసేందుకు మంతనాలు జరుపుతున్నారు. అయితే ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. దరఖాస్తు ప్రక్రియ ముగియగానే, సంబంధిత వ్యాపారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించి దుకాణాల లబ్దిదారులను ఎంపిక చేస్తారు. లక్కీ డ్రాలో దుకాణాలు దక్కించుకున్న లబ్దిదారులకు డిసెంబరు 1వ తేదీ నుంచి లైసెన్స్ అమల్లోకి వస్తుండగా 2027 నవంబరు 30వ తేదీ వరకు అమలు కానుంది. షాపులు దక్కించుకున్న వ్యాపారులు డిసెంబరు ఒకటవ తేదీ నుంచే దుకాణాల్లో మద్యం విక్రయాలు జరిపేందుకు అవకాశం ఉంది.

షాపులకు రిజర్వేషన్లు ఇలా...

జిల్లాలో మద్యం షాపులకు రిజర్వేషన్లు గత మద్యం పాలసీకి భిన్నంగా వివిధ కేటగిరీల దమాషానా షాపులు కేటాయించనున్నారు. జిల్లాలో మొత్తం 73 మద్యం షాపులు ఉండగా మొత్తంగా 30 శాతం రిజర్వేషన్ అమలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో 22 దుకాణాలను వివిధ వర్గాల వారికి రిజర్వు చేయనున్నారు. ఇందులో భాగంగా ఎస్సీ సామాజిక వర్గాలకు 10, ఎస్టీలకు 05, గౌడ కులస్థులకు గరిష్టంగా 15 శాతం షాపులు రిజర్వు కానున్నాయి. మిగతా 51 షాపులకు ఆయా రిజర్వేషన్ వర్గాలతోపాటు నాన్ రిజర్వు వర్గాలకు చెందిన వ్యాపారులు కూడా దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు ఉంది. లైసెన్సు. (తరువాయి 7లో)

వంతెన నిర్మించండి..

● కలెక్టర్‌కు సీపీఎం నాయకుల వినతి



కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నస్పూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సంఘమల్లయ్య పల్లెలో ఒర్రెపై వంతెన నిర్మాణం చేయాలని కోరుతూ గురువారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఒర్రెపై తాత్కలిక సిమెంట్ పైపుల కల్వర్టు నిర్మాణం ఉండేదన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఒర్రె వరద ప్రవాహనికి కల్వర్టు కొట్టుకుపోయిందన్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఆదర్శనగర్, ప్రశాంత్ నగర్, కృష్ణా కాలనీ, లక్ష్మి నగర్ నుంచి సంఘ మల్లయ్య పల్లె నుంచి గనులకు వెళ్ళే కార్మికులకు ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఒర్రెపైబ్రిడ్జితో ఇరువైపుల సిమెంట్ రోడ్డును నిర్మించడానికి చర్యలు చేపట్టా లని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా పార్టీ కార్యదర్శి సంకె రవి, కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.

బాల సదనం నిర్మాణ పనులు పూర్తి చేయండి

బాలసదనం భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. నస్పూర్ పట్టణంలో విషన్ వాత్సల్య కింద రూ. 1.34 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బాల సదనం భవన నిర్మాణ పనులను గురువారం కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలిం చారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేప ట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

● ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా

జన్నారం,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో గురువారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయ పాలన పాటించడంతో పాటు విద్యార్థులతో కలిసి ఉండాలన్నారు. పాఠశాలలోని కిచెన్‌తో పాటు వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. తరిగిన కూరగాయలతో పాటు వండిన భోజనాలను సైతం పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ఉన్న క్లాస్‌రూంలోకి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువాలని సూచించారు. ఇంచార్జీ వార్డెన్ గణేష్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూళ్లలో ఫ్యాన్‌లు, ఆర్‌వో ప్లాంట్‌లు సరిగ్గా పనిచేయడం లేదని చెప్పడంతో అక్కడే ఉన్న ఐటీడీఏ పీవో సమస్యలన్ని సాయంత్రం కల్ల పరిష్కరించాలని వెంటనే డీటీడీవో జనార్ధన్‌ను ఆదేశించారు. ఆమె వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మంచిర్యాలక్రైం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి గాను 44 పాఠశాలల్లో పూర్వ ప్రాథమికతరగతులు నిర్వహించడానికి పాఠశాలకు ఒక ప్రీప్రైమరి ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్ స్ట్రక్టర్‌కు 10+2 పాసై ఉండాలని, ఆయాపోస్టులకు 7వ తరగతి పాసై ఉండాలని ఈ నెల 25న దరఖాస్తులను అందజేయాలని సూచించారు. దరఖాస్తు సమర్పించే సమయంలో ఒరిజినల్ సర్టిఫికేట్‌తో పాటు రెండు జతల జిరాక్స్ ప్రతులను తీసుకరావాలని అభ్యర్థుల వయో పరిమితి 18 నుంచి 44 సంవత్సరాలు ఉండాలని ఎస్సీ, ఎస్టీ మహిళలకు 5 సంవత్సరాలు, ఎక్స్‌సర్వీసు పర్సనల్‌కు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు, దివ్యాంగ మహిళలకు 10 సంవత్సరాల తరలింపు ఉంటుందని తెలిపారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

మంచిర్యాలక్రైం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో వందరోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం వన మహోత్సవాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని డివిజన్‌లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకోసం ప్రతీఒక్కరు మొక్కలునాటి చెట్లను సంరక్షించాలని నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్ అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కరుణాకర్, శానిటరీసూపర్‌వైజర్ లింగాల కుమారస్వామి, సానిటరీ ఇన్స్ పెక్టర్ వైకుంఠం, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఇన్విరాన్ మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, మున్సిపల్ వార్డుఆఫీసర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలెక్టర్ చాంబర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను మొక్కను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్సీ

చెన్నూరు ఎస్‌బీఐలో భారీ స్కామ్

- క్యాషియరే సూత్రధారి
- బంగారంతో పాటు నగదు స్వాహా
- కొనసాగుతున్న విచారణ
- లబోదిబోమంటున్న ఖాతాదారులు

6

ఉత్తమ ఉద్యోగికి సన్మానం



దండేపల్లిలో ఏడీఈ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న దండేపల్లి సెక్షన్ విద్యుత్ సిబ్బంది

దండేపల్లి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్తమ సేవలు అందించి స్వాతంత్రదినోత్సవం రోజున ఉత్తమ సేవా పథకం అందుకున్న లక్షెట్టిపేట ఏడీఈ ప్రభాకర్‌రావుకు దండేపల్లి మండల విద్యుత్ అధికారులు, సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా విద్యుత్‌శాఖ అధి కారులు మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటులో ఉండి నిరంతరం సేవలు అందించారన్నారు. ఏడీఈ ప్రబాకర్ మాట్లాడుతూ ప్రజలు, రైతులు వినియోగదారులకు అందుబాటు ఉండి మంచి సేవలు అందిస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈదిశగా ప్రతి ఉద్యోగి మంచి సేవలు అందించి ప్రజల మన్నలు పొందాలన్నారు. కార్యక్రమంలో దండేపల్లి ఏఈఈ బాపు, సబ్ ఇంజనీర్ సాయి నరేష్, ఎస్ఎల్ఐ నర్సయ్య. ఎల్ఐలు గౌస్, లక్ష్మణ్, ఎల్ఎంలు నాగన్న, మల్లేష్, శ్రీధర్, సామిల్, శేఖర్‌తో పాటు ఏఎల్ఎంలు, జేఎల్ఎల్‌లు ఆర్టిజన్స్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు

● కలెక్టర్ కుమార్ దీపక్



బాబానగర్ ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని బాబానగర్ ప్రభుత్వ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, వసతి గృహం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీరు, తరగతి గదులు, వంటశాల, రిజిష్టర్లు, పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సదుపాయాలను విద్యా ర్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన తాగునీటిని అందించాలని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం గడ్‌పూర్ గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించి మందుల నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. గ్రామాల్లో కొనసా గుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్వహణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఇసుక తరలించేందుకు అనుమతి మంజూరు

మంచిర్యాల కలెక్టరేట్ : జైపూర్ మండలం వేలాల స్టాక్ యార్డులో ఉన్న ఇసుకను టీజీఎండీసీ సాండ్ బజార్‌కు తరలించేందుకు అనుమతి మంజూరు చేశామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ వేలాల స్టాక్ యార్డులో ఉన్న 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను టీజీఎండీసీ సాండ్ బజార్‌కు కేటాయించడం కోసం సమర్పించిన ప్రతిపాదనలను ఆమోదించామన్నారు.

ప్రభుత్వం అన్ని మండలాల్లో ఇసుక బజార్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, వర్షాల వల్ల ఇసుక సేకరణలో అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం వేలాల స్టాక్ యార్డులో అందుబాటులో ఉన్న సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను కేటా యించి రవాణా చేయడానికి అనుమతించామన్నారు. ఈ సమావేశంలో భూగర్భ గనులు శాఖ అధికారులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ఎలాంటి అపశృతి జరుగకుండా జాగ్రత్తలు పాటిస్తూ నవరాత్రిఉత్సవాలు నిర్వహించుకోవాలని మంచిర్యాల ఏసీపీప్రకాశ్ అన్నారు. గురువారం ఎంకన్వెన్షన్‌హాల్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల శాంతి కమిటీని ముఖ్యఅతిథులుగా ఆర్డీవో శ్రీనివాస్‌రావు, నగరపాలక కమిషనర్ సంపత్, తహసీల్దార్ రఫాతుల్లా హుస్సేన్, ఫైర్ జిల్లా ఫైర్ అధికారి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గణేష్ మండపానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినవారిని బైండోవర్ చేస్తామని, గణేష్ మండపాల వద్ద, గణేష్ నిమజ్జనం ఉత్సవం సందర్భంగా ఎవ్వరు కూడ మద్యం సేవించరాదని సూచించారు. మండపాల వద్ద న్యూసెన్స్‌కు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ ముఖ్యంగా మండపాల వద్ద ఎలక్ట్రిసిటీ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏ చిన్న పొరపాటు జరిగిన విద్యుదాఘాతంతో ప్రాణాలకే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు పాటించాలన్నారు. ని మజ్జన కార్యక్రమంలో భాగంగా యువత భక్తి శ్రద్ధలతో పాల్గొనాలని అనవసరమైన గొడవల్లో తలదూర్చి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రతిఒక్కరు సమ యం ప్రకారం రాత్రి 12లోపే నిమజ్జనం కార్యక్రమం పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రమోద్‌రావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తమ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. అనంతరం సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను వినియోగించాలని సూచించారు. అత్యావసర సమయాల్లో 100 నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. మండపంలో ఉండేవారు నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కేంద్రానికి రోడ్డేది..?



అటవీశాఖ అనుమతులు రాక మంగెనపల్లి నుంచి నాగారం వరకు ఉన్న మట్టి రోడ్డు

రహదారి సౌకర్యం లేక ప్రజల ఇక్కట్లు



అధ్వానంగా ఉన్న బుయ్యారం నుంచి కన్నెపల్లికి వెళ్లే రోడ్డు

వేమనపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి మండల కేంద్రంనుంచి నియోజకవర్గ కేంద్రమైన బెల్లంపల్లికిరోడ్డు లేకపోవడంతో మండలప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనే వెనకబడిన మండల కేంద్రంగా పేరుగాంచిన వేమనపల్లి నుంచి బెల్లంపల్లికి బీటీ రోడ్డు లేకపోవడం విచారకరం. సుమారు 45కిలో మీటర్ల దూరంలో ఉండే బెల్లంపల్లికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రవాణా సౌకర్యం కరువై మండల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సుసౌకర్యం ఇక్కడి మహిళలకు అందకుండా పోతుంది. రాష్ట్రంలోని మహిళలందరికి ఉచితబస్సు పథకం కలుగుతున్నప్పటికీ మండలానికి ఆర్టీసీ బస్సులు రాక ఇక్కడి మహిళలకు ఈ పథకం అందకుండా పోతోంది. వేమనపల్లి నుంచి కన్నెపల్లి మీదుగా నియోజకవర్గానికి వెళ్లాల్సి ఉంటుంది. ఈ రూట్‌లో బీటీరోడ్డు లేదు. 15ఏళ్ల క్రితం నిర్మించిన తారురోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా అధ్వానంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మంగెనపల్లి నుంచి నాగారం వరకు నాలుగు కిలోమీటర్లన్నర రోడ్డుకు అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో కేవలం మట్టి రోడ్డే ఉంది. ఈ మట్టి రోడ్డు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారి కనీసం నడక సైతం నరకప్రాయంగా మారింది. మండలంలోని బుయ్యారం, జిల్లెడ, జక్కెపల్లి, నాగారం, సూరారం, బమ్మెన, చామనపల్లి, బద్దెంపల్లి, లక్ష్మీపూర్ తదితర గ్రామాల ప్రజలు వేమనపల్లికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అలాగే మండలప్రజలు నియోజకవర్గానికి వెళ్లాలంటే కన్నెపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కన్నెపల్లి వరకు రోడ్డు లేకపోవడంతో ఇక్కడిప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 ఏళ్ల క్రితం నిర్మించిన తారు రోడ్డు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఆ గుంతల్లో వర్షం నీరు నిలిచి కనీసం ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని సగానికి పైగా గ్రామాల ప్రజలు అవసరాల నిమిత్తం బెల్లంపల్లికి వెళ్లి వస్తుంటారు. వీరికి రవాణా సౌకర్యం లేకపోవడం శాపంగా మారింది. వర్షాకాలంలో అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా రాని పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో తమ గ్రామాలకు రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని నాయకులు హామీలు ఇస్తున్నారు కానీ కార్యరూపం దాల్చడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లి నుంచి కన్నెపల్లి మీదుగా వేమనపల్లికి రోడ్డు లేక బస్సులురాకపోవడంతో వేమనపల్లి ప్రజలు ప్రైవేటువాహనాల్లో అధికడబ్బులు చెల్లించి అతి కష్టం మీద వెళ్లి రావాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు వెంటనే స్పందించి వేమనపల్లి నుంచి బెల్లంపల్లికి రవాణా సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అటవీ శాఖ అనుమతులు రాగానే రోడ్డు పనులను ప్రారంభిస్తాం

వేమనపల్లికి వెళ్లే రూట్‌లో నాగారం నుంచి మంగెనపల్లి వరకు నాలుగు కిలోమీటర్లన్నర అటవీ మార్గం ఉండడంతో ఇక్కడ అటవీ శాఖ నుంచి రోడ్డు నిర్మాణానికి అనుమతులు రావ డం లేదు. అటవీ శాఖ అనుమతుల కోసం సర్వేచేసి నివేదికను సమర్పించాం. అటవీ శాఖ నుంచి అనుమతులు రాగానే బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. అలాగే ఇదే రూట్‌లో వేమనపల్లి నుంచి నియోజకవర్గ కేంద్రానికి వెళ్లాంటే కన్నెపల్లివరకు పూర్తి స్థాయిలో బీటీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టేం దుకు చర్యలు తీసుకుంటాం.

- జగదీశ్వర్, ఆర్‌అండ్‌బీ డీఈ

స్టేజ్ 2 అనుమతులు రావాలి

నాగారం నుంచి మంగెనపల్లి వరకు రోడ్డు వేయడానికి అటవీశాఖ అనుమతులు రాక నిలి చిపోయింది. బీటీరోడ్డు నిర్మాణానికి అటవీశాఖ నుంచి స్టేజ్2 అనుమతులు రావాల్సి ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వేచేసి అనుమతుల కోసం నివేదికలను అటవీశాఖకు సమర్పించారు కానీ ఇప్పటి వరకు అనుమతులు రాలేదు. అనుమతులు కేంద్రం నుంచి రావాల్సి ఉంటుంది. అనుమతులు రాగానే ఆర్‌అండ్‌బీ అధికారులకు వివరాలను వెల్లడిస్తాం.

- దయాకర్, ఎఫ్‌ఆర్‌వో

ప్రైవేటు ఆసుపత్రులకు నోటీసులు

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు ఆసుపత్రులను అధికారులు తనిఖీ చేసి ఆయా యజమానులను నోటీసులు జారీ చేశారు. పలు చోట్ల ర్యాంపు సౌకర్యం, ధరల పట్టిక, ఇతర నిబంధనలు పాటించకపోవడంపై ఫిర్యాదులు రావడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సీతారం ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారు.

కలప దుంగలు స్వాధీనం

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పెద్దవాగు రోడ్డులోని ఓ సామిల్‌లో అక్రమంగా దాచి ఉంచిన కలప నాన్‌టేక్ దుంగలను ఫారెస్టు అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. రూ. 55 వేల విలువ గల ఏడు టన్నుల కలప దుంగలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నరగ్ ఎఫ్ఆర్‌వో అనిల్ కుమార్, డిప్యూటి రేంజి అధికారి హేమలత వివరించారు.

రైతులను ఆదుకోవాలి

వాంకిడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అడ ప్రాజెక్టు నీటి ప్రవాహంతో వాంకిడి మండలం జైత్‌పూర్, బోర్ద గ్రామ శివారులో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు సీపీఎం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, కార్తీక్, టీకానంద్, మల్లేష్, తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

చినుకు పడితే వణుకే..

● పలు కాలనీ వాసుల ఆవేదన

కాగజ్‌నగర్‌టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని పలు కాలనీల్లో వర్షం చినుకు పడితే కంటి మీద కునుకులేకుండా వణుకు పుడుతోంది. ప్రతీ యేటా వర్షాలకు వరద నీరు రోడ్లపైకి వస్తోంది. ఆ వరద నీరంతా ఇళ్లలోకి వస్తోంది. ముఖ్యంగా పట్టణం లోని సంజీవయ్య కాలనీ వాసుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అలాగే సర్‌సిల్క్ కాలనీ, బాలాజీ నగర్, సి. బాబుకాలనీ, నౌగాం బస్తీ, శ్రీనగర్ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల ప్రజలు వర్షం పడితేచాలు వణికిపోతున్నారు. ప్రధాన రోడ్లపై నుంచి వరదనీరు పారుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. వర్షం నీరుతో సహా కాలువలు పొంగి మురికి నీరు పోటెత్తుతోంది. వర్షాకాలంలో ప్రతీ యేటా మురికి నీరంతా ఇళ్లలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కాలనీ వాసులు అష్టకష్టాలు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంజీవయ్య కాలనీ సమీపంలోని ఒర్రె నీరంతా కాలనీలోకి, ఇళ్లలోకి చేరి తిరిగి బయటికి రోడ్ల మీద ప్రవహిస్తోంది. రాత్రిపూట ఒక్కసారిగా వర్షం వచ్చిందంటే చాలు పక్కనే ఉన్న నాళా నీరు ప్రవాహంలా వస్తోంది. కాలనీ సమీపంలోని ఒర్రెపై కల్వర్టు వరద నీటికి సరిపోకపోవడంతో పాటు, కొంత నాళాభాగం కబ్జాకు



సంజీవయ్య కాలనీ వెనుక వైపు నుంచి ముంచెత్తుతున్న వరద(ఫైల్)

గురికావడంతో ప్రతీ యేటా ఇదే పరిస్థితి తలెత్తుతోంది. కాలనీ సమీపంలో కల్వర్టు నిర్మించినా సమస్య పరిష్కారం కాకపోగా మరింత జఠిలంగా మారింది. రెండుమూడేళ్లగా పరిస్థితి తీవ్రంగా మారింది. ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీరు కాలువలో ప్రవహిస్తూ కల్వర్టు వద్దకు చేరేసరికి ఇరుకుగా మారింది. దీంతో కాలనీలోకి వరద పోటెత్తి భయంభయంగా గడపాల్సిన పరిస్థితి. ఆయా కాలనీల్లో కూడా మురికికాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో పాటు, కొన్నికబ్జాలకు గురయ్యాయి. వరద నీరు, మురికినీరు రోడ్లపైకిచేరి రోజుల తరబడి బురదతో ఉండడంతో వాహనదారులకు, పాదాచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వరద నీటితో జలమయంగా మారుతున్నాయి. దీంతో పాలు కాలనీల్లో మోకాళ్లలోతు వరదనీటిలో కష్టాలు పడాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంలో మున్సిపల్ కమిషనర్ ఏల్పుల రాజేందర్ మాట్లాడుతూ గతంలో పెట్రోల్ పంపు నుంచి తీరందాజ్, నౌగాంబస్తీ మీదుగా కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ఉన్న కాలువస్థానంలో మరింత వెడల్పుగా డ్రైనేజీనిర్మాణం పనులు చేపడతామన్నారు. ఇందుకు నిధులు కూడా మంజూరైనట్లు వివరించారు. అలాగే పలు కాలనీల్లో ఇబ్బందులపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బాలాజీ నగర్‌లో మోకాళ్ల లోతు నిలిచిన వర్షపునీరు(ఫైల్)

చెన్నూరు ఎస్‌బీఐలో భారీ స్కామ్

- బంగారంతో పాటు నగదు స్వాహా
- క్యాషియరే సూత్రధారి
- లబోదిబోమంటున్న ఖాతాదారులు

చెన్నూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణం పాత బస్టాండ్ ప్రాంతంలోని ఎస్‌బీఐ బ్యాంక్-2లో భారీ స్కాం జరిగింది. బ్యాంకులో పనిచేసే క్యాషియర్ రవీందర్ సూత్రధారి అయినట్లు ప్రాథమిక విచారణలో తేలగా ఆయన రెండు రోజులుగా పరారీలో ఉండడంతో ఈ అనుమానాలకు బలం చేకూరింది. బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి పలువురు ఖాతాదారులు లోన్ తీసుకోగా వారికి సంబంధించిన బంగారంతోపాటు కొంత నగదును క్యాషియర్ స్వాహా చేశాడు. నాలుగు రోజులుగా సెలవులో ఉన్న బ్యాంకు మేనేజర్ మనోహర్‌రెడ్డి గురువారం తిరిగి విధుల్లోకి చేరగా బ్యాంకులోని గోల్డ్, నగదుపై అనుమానం వచ్చి ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో శాఖ రీజనల్ మేనేజర్ శుక్లాతోపాటు పలువురు బ్యాంకు ఉన్నతాధికారులు, ఆడిటింగ్ సిబ్బంది హుటాహుటిన బ్యాంకుకు చేరుకుని ఆడిటింగ్ చేస్తున్నారు. దీంతోనే అసలు విషయం బయటకు పొక్కింది. సుమారు 330 మంది గోల్డ్‌లోన్ ఖాతాదారుల బంగారం స్వాహా అయినట్లు తేలింది. అయితే ఇది ఎంత అనేది విచారణ పూర్తి అయితే కానీ తెలియదు. అలాగే డిపాజిట్‌లకు సంబంధించి రూ. 80 లక్షల నుంచి కోటి రూపాయల వరకు స్వాహా అయినట్లు ప్రాథమిక అంచనా. బంగారంతో పాటు నగదు స్వాహా అయినట్లు బ్యాంకు ఉన్నతాధికారుల ఆడిటింగ్‌లో తేలడంతో సంబంధిత ఉన్నతాధికారులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు, రూరల్ సీఐలు దేవేందర్‌రావు, బన్సీలాల్‌లు, ఎస్‌ఐలు బ్యాంకుకు చేరుకుని విచారణ ప్రారంభించారు.

-మూడు నెలలకు ఒకసారి ఆడిటింగ్

ప్రతీ మూడు నెలలకు ఒకసారి బ్యాంకు నిబంధనల ప్రకారం ఆడిటింగ్ కొనసాగుతుండగా గత చివరి ఆడిటింగ్ జరిగి రెండు నెలల 20 రోజులు అయ్యింది. అంటే ఈ రెండు నెలల 20 రోజుల్లోనే బంగారంతో పాటు నగదు స్వాహా అయినట్లు తెలుస్తోంది. తాకట్టు పెట్టుకున్న బంగారంపై, నగదుపై బ్యాంకు మేనేజర్, క్యాషియర్‌ల పర్యవేక్షణ ఉంటుంది. కానీ మేనేజర్ క్యాషియర్‌ను నమ్మి సంబంధిత లాకర్ల తాళాలు క్యాషియర్‌కు అప్పగించడంతో క్యాషియర్ లూటీ చేసినట్లు తెలుస్తోంది. లేదా మేనేజర్, క్యాషియర్ ఇద్దరు కలిసి ఈ పనికి పాల్పడ్డారా అనేది విచారణలో తేలనుంది. మరో వైపు సంబంధిత క్యాషియర్ రెండు రోజులుగా విధులకు హాజరు కాకపోవడం, ఆయన సెల్‌ఫోన్ స్విచాఫ్ వస్తుండడంతో క్యాషియరే సూత్రధారి అనేది అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. క్యాషియర్ రవీందర్ తన భార్య పేరిట అతను పనిచేసే బ్యాంకు నుంచి దాదాపు కోటి రూపాయల లావాదేవీలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే 330 మంది లావాదేవీలకు సంబం ధించిన మూడు కిలోల నుంచి నాలుగు కిలోల బంగారంతో పాటు నగదు రూ. 80 లక్షల నుంచి కోటి వరకు స్వాహా అయినట్లు తేలగా మొత్తంగా రూ. ఐదు కోట్ల భారీ స్కామ్ జరిగినట్లు తెలుస్తోంది.

- లబోదిబోమంటున్న ఖాతాదారులు

ఎస్‌బీఐ-2లో భారీ స్కామ్ జరిగిందన్న సమాచారం బయటకు పొక్కడంతో ఒక్కసారిగా ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరుకున్నారు. గోల్డ్ పెట్టి లోన్ తీసుకున్న ఖాతాదారులు తమ బంగారం పోయిందని లబోదిబోమంటున్నారు. బ్యాంకులో ఏం జరుగుతుందో తెలియక బ్యాంకు బయట గంటల కొద్ది నిరీక్షించారు.



మాట్లాడుతున్న రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ

అయితే స్కామ్ జరిగింది నిజమే కానీ ఎంత అనేది నిర్ధారణ కాలేదు. గోల్డ్ తాకట్టు పెట్టి లోన్ తీసుకున్న ఖాతాదారుల వివరాలు ఉంటే ఎంత బంగారం, ఎంత నగదు స్వాహా అయ్యిందనేది తేలనుంది. మరో వైపు ఈ స్కామ్‌కు పాల్పడిన రవీందర్‌ది స్వస్థలం జైపూర్ మండలంలోని శెట్‌పల్లి కాగా అక్కడకు పోలీసులు వెళ్లినా ఆయన అందుబాటులో లేరు. కాగా క్యాషియర్ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు పాల్పడతాడని ప్రాథమిక విచారణలో తేలింది. బ్యాంకులో ఆడిటింగ్ కొనసాగుతుండగా శుక్రవారం నాటికి ఇది పూర్తయ్యే అవకాశం ఉంది. బ్యాంకు ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని, విచరణ పూర్తయితే కానీ దోషులు ఎవరు , బంగారం, నగదు ఎంత స్వాహా అయ్యింది అనేది చెప్పలేమని, విచారణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ తెలిపారు.

పింఛన్లు పెంచకపోతే సహించేది లేదు

బెల్లంపల్లి/కౌటాల ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అందించే పింఛన్లు పెంచకుంటే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ అన్నారు. మహాగర్జన సభని యోజకవర్గస్థాయి సన్నాహక సదస్సును గురువారం బెల్లంపల్లి పట్టణం, కౌటాల మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంద క్రిష్ణ మాదిగ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన తేదీ నుంచి కొత్త పెన్షన్ అందజేస్తున్నారన్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు చంద్రబాబును చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు వేలాది మంది తరలిరావాలని సూచించారు. అనంతరం మంద క్రిష్ణమాదిగను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఎలిగేటి తిరుపతి, నాయకులు మధూకర్, నరేష్, పిట్టల సత్యనారాయణ, ఇగురపు విఠల్, రమేష్, జనార్దన్, నాందేవ్ పాల్గొన్నారు.

● పరామర్శ

జైపూర్/కాసిపేట: ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ తల్లి సుందిళ్ల శంకరమ్మ మృతిచెందగా ఆయన కుటుంబాన్ని జైపూర్‌లో, కొంత కాలంగా అనార్యోంతో బాధపడుతున్న సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కల్వల లక్ష్మణ్‌ను సోమగూడెంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ గురువారం పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

చిన్న పిల్లలకు గుండె పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సిద్దిపేట సత్యసాయిబాబా ట్రస్ట్ సహకారంతో డీఎంహెచ్‌వో సీతారాం ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు పుట్టుకతో వచ్చిన గుండె వ్యాధుల నిర్ధారణ కోసం ఈడీ, ఈసీహెచ్‌వో పరీక్షలు, రక్త పరీక్షలు, ఎక్స్‌రే నిర్వహించారు. ఈ సందర్భంగా 49 మంది పిల్లలను పరీక్షించి అవసరం ఉన్న వారికి సెప్టెంబరు నెలలో ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ రిషి, ట్రస్ట్ సభ్యులు జగన్నాథశర్మ, గణేష్, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక రక్షణ బహుమతుల ప్రదానంపై సమీక్ష

శ్రీరాంపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వార్షిక రక్షణ బహుమతుల ప్రదానంపై ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. ప్రతీ ఉద్యోగి కార్యక్రమంలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. అన్ని విభాగాలకు చెందిన అధిపతులు వారికి కేటాయించిన పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, ఓసీపీల పీవోలు ఏవీరెడ్డి, వెంకటేశ్వర్లు, ఏజెంట్లు రవికుమార్, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● స్టాళ్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

55వ వార్షిక రక్షణ బహుమతుల ప్రదానోత్సవం శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహించనున్నట్లు జీఎం ఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలలో ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు చేసుకునే వ్యక్తులు ఈ నెల 25వ తేదీలోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో తమ దరఖాస్తులు అందజేయాలని కోరారు.

క్లరికల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): క్లరికల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు క్లరికల్ సబ్ కమిటీ పక్షాన ఆర్‌కే 7 గని మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఫర్నిచర్, కంప్యూటర్లు, ప్రింటర్లు సమస్య ఎక్కువగా ఉన్నందున క్లరికల్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరిపోయినంత సిబ్బంది కూడా లేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, జీఎం కమిటీ చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శి సారయ్య, ఏరియా స్టోర్ పిట్ కార్యదర్శి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గిరిజన ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

జైపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ కమిటీ సభ్యులు గురువారం మంత్రి సీతక్క, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలను హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కమిటీ అధ్యక్షుడు ధరావంత్ పంతుల, జనరల్ సెక్రెటరీ భుక్య నాగేశ్వర్‌రావు సమస్యలను విన్నవిం చారు. వారు మాట్లాడుతూ సింగరేణిలో గిరిజన ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ముఖ్యంగా క్లస్టర్, ఇంటర్ క్లస్టర్ ప్రమోషన్‌లో అన్యాయం జరుగుతోందన్నారు. అలాగే రోస్టర్ రిజిష్టర్ వేరిఫికేషన్ ప్రమోషన్ పాలసీకి సంబంధించిన అంశాలు త్వరగా పరిష్కారం చేయాలని కోరామన్నారు. సంక్షేమ సంఘానికి గౌరవాధ్యక్షురాలు సీతక్కను ఉండాలని కోరామన్నారు. ఈ సందర్భంగా సీతక్క సమస్యలను సమగ్రంగా డాక్యుమెంటరీ రూపంలో అందిస్తే ప్రత్యేకంగా ఒక సమావేశం ఏర్పాటు చేసి అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో చీఫ్ లైజన్ ఆఫీసర్ కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ దశరధ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోకాళ్ల తిరుమల్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు సమస్యలను విన్నవిస్తున్న సింగరేణి గిరిజన ఉద్యోగులు

వసతుల కల్పనలో ముందంజ : జీఎం



ఐటీ విభాగాన్ని ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు వసతులు కల్పించడంలో సింగరేణి సంస్థ ముందంజలో ఉందని ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. లక్ష పది వేల రూపాయలతో ఆధునీకరించిన ఐటీ విభాగాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన వసతులు కల్పిస్తున్నామన్నారు. ఐటీ కార్యాలయం ఆధునికీకరణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, డీజీఎంలు రాజన్న, ఆనంద్ కుమార్, హరినారాయణ, సర్వే అధికారి నర్సింగరావు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఐటీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాలు

మందమర్రిటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. బొగ్గు నాణ్యత, ఉత్పత్తి లక్ష్యాలు, రక్షణ తదితర వాటి గురించి వివరిస్తున్నారు. ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్ల వద్ద సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్ పాల్గొని నాణ్యమైన బొగ్గుకు మార్కెట్‌లో మంచి రేటు ఉంటుందని, నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలని సూచిస్తున్నారు. రానున్న రోజుల్లో ఉత్పత్తి లక్ష్యాలను పెంచకపోతే ఇతర దేశాల నుంచి సంస్థలు బొగ్గు కొనుగోలు చేసేందుకు సిద్దంగా ఉన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రక్షణతో కూడిన అదనపు నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలన్నారు. ఉద్యోగులు, అధికారులు సమిష్టిగా కృషి చేస్తూ ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని సూచిస్తున్నారు. అలాగే రక్షణపై ప్రతిజ్ఞ చేయిస్తున్నారు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

యువకుడి ఆత్మహత్య



ముఖేష్(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జిల్లా కేంద్రంలోని వాసవి టెంపుల్ ఎదురుగా చోటు చేసుకుంది. స్థానిక సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన ముఖేష్(30) కార్పెంటర్‌గా పని చేసుకుం టూ జీవిస్తున్నాడు. రోజులాగా బుధవారం రాత్రి తిగి ఇంటికి వచ్చిన ఆయనను భార్య సంపత్తి మందలించగా ఇరువరి మధ్య కాసేపు తోపులాట జరిగింది. ఇంట్లో ఫ్రిడ్జ్, టీవీ పగలగొట్టాడు. అనంతరం ఇద్దరు పిల్లలను, భార్యను వేరే గదిలోకి నెట్టి వేశాడు. భార్య పిల్లలు పక్క రూపంలో నిద్రించారు. గురువారం ఉదయం తలుపులు కొట్టగా ఎంతకు తీయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించా రు. వారు చేరుకొని తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడు ముఖేష్ భార్య సంపత్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాము కాటుతో విద్యార్థి మృతి



నవదీప్(ఫైల్)

పెంచికలపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన జగదీష్, సులోచన దంపతుల కుమారుడు నవదీప్ (11) అనే విద్యార్థి బుధవారం రాత్రి పాము కాటుతో మృతి చెందాడు. నవదీప్ సిర్పూర్(టి) ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం హోం సిక్ సెలవులతో ఇంటికి వచ్చాడు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న సమ యంలో పాము కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు కాగజ్‌నగ ర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెం దాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మృత దేహాన్ని సందర్శించి కుటుంబసభ్యలకు సానుభూతి తెలిపారు. అంత్యక్రి యల నిమిత్తం ఐదు వేల రూపాయల ఆర్థికసాయం అందించారు.

రక్తహీనతతో బాలింత మృతి

వాంకిడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన మడావి దేవిబాయి(22) రక్తహీనతతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ నెల 14వ తేదీన పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికిలో చేర్పించగా బిడ్డను జన్మనిచ్చింది. ఆమెకు రక్తహీనతతో అనారోగ్యంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కౌటాల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలోడి గ్రామంలో పేకాట ఆడుతున్న అయిదుగురిని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. గురువారం పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి పేకాట ఆడుతున్న రుద్రాపూర్‌కు చెందిన నిట్టూరి సత్తయ్య, తలోడికి చెందిన ఎర్కోల్ల వెంకటేష్, కౌటాలకు చెందిన దుర్గం గణేష్, బోర్కుట్ విల్, సిర్పూర్(టి)కి చెందిన బొడ్డు రవిలను పట్టుకుని వీరి నుంచి రూ.10,980 నగదు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. వీరిపై కౌటాల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై రాజు, కానిస్టేబుల్ మహమూద్, విజయ్, మధు, రమేష్, గౌస్, సాయితేజ, రవి, సాయి, ప్రకాష్ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట ఇద్దరు బైండోవర్

దండేపల్లి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లింగాపూర్ అటవీ బీట్‌లో 380 కంపార్ట్‌మెంట్‌లో గల కవ్వాల్ రిజర్వు అటవీ భూముల్లోని చెట్లను నరికి ఆ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేసిన ఇద్దరు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎఫ్ఆర్‌వో సుష్మారావు తెలిపారు. లింగాపూర్ గ్రామానికి చెందిన గంగరాజు, లక్ష్మణ్ అటవీ ప్రాంతంలోని చెట్లను నరికివేయడంతోపాటు అటవీ భూమి ఆక్రమించుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మారావు వారిపై కేసు నమోదు చేశారు. గురువారం దండేపల్లి తహసీల్దార్ రోహత్ దేశ్‌పాండే ఎదుట లక్ష రూపాయల సొంత పూచికత్తుతో ఇద్దరిని బైండోవర్ చేశారు. కార్యక్రమంలో లింగాపూర్ బీట్ సెక్షన్ ఆఫీసర్స్ రాజేందర్, పాల్గొన్నారు.

పులిదాడిలో మూడు పశువుల మృతి

కాసిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ అటవీ రేంజ్ పరిధిలో మళ్లీ పెద్దపులి అలజడి మొదలైంది. రొంపెల్లి అటవీ సెక్షన్ పరిధిలోని 417 కంపార్ట్‌మెంట్‌లో బుధవారం పెద్దపల్లి ఆవులమందపై దాడి చేసిన ఘటనలో ఒక ఆవు, ఎద్దు, లేగదూడ మృతి చెందాయి. పశువుల కాపరులు అటవీశాఖ అధికారులకు ఇచ్చిన సమాచారంతో దేవాపూర్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అనిత తన సిబ్బందితో కలిసి గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలం గంభీరావుపేటకు చెందిన పశువుల కాపరులు బుధవారం రొంపెల్లి అటవీ శివారు ప్రాంతానికి మేత కోసం వచ్చారు. ఒక్కసారిగా పెద్దపులి ఆవుల మందపై దాడి చేయడంతో ఆవుల మంద చెల్లాచెదురైందన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించగా మూడు పశువులు మృతి చెందినట్లు గుర్తించామన్నారు. మృతి చెందిన పశువులు గంభీరావుపేటకు చెందిన నైతం శేఖర్, తుమురం మల్కులకు చెందినవిగా గుర్తించినట్లు ఆమె తెలిపారు. పశువుల కాపరులు, వ్యవసాయ కూలీలు, రైతులు ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని ఎఫ్ఆర్‌వో అనిత సూచించారు.

మాదకద్రవ్యాల రవాణా అరికట్టేందుకు తనిఖీలు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు జిల్లాలో విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశంలో ఎస్పీ కాంతిలాల్ సుభాష్, సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి మాదకద్రవ్యాల నివారణపై నషా ముక్తి భారత్ అభియాన్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుమరంభీం జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. విద్యాలయాలకు 200 మీటర్ల పరిధిలో ఎలాంటి పాన్ టేలాలు ఉండకూడదని పొగాకు పదార్థాలు విక్రయాల జరగకుండా చర్యలు తీసుకోవాలని, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో జిల్లా మద్యనిషేధ శాఖ అధికారి జ్యోతికిరణ్, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా రవాణాధికారి రాంచందర్, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, సంక్షేమ పథకాలపై కళాజాతా

కెరమెరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనోర గ్రామంలో గురువారం పారిశుధ్యం, సంక్షేమ పథకాలపై కళాజాతా బృందం సభ్యులు బాపు ఆధ్వర్యంలో గోండి, కొలాం భాషలలో నాటిక రూపంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య లోపం వల్ల కలిగే అనార్థాలు, వివిధ రకాల సంక్షేమ పథకాల అమలుపై కళాజాతా నిర్వహించారు. సభ్యులు మోహన్‌నాయక్, సోమశేఖర్, పురుషోత్తం, శిరీష, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

మందమర్రిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుగులపేట గ్రామంలో గురువారం ఎంపీడీవో రాజేశ్వర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులు ఇళ్లనిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం దశల వారీగా బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి వీరేందర్ పాల్గొన్నారు.

28న ప్రజావేదిక

కాసిపేట, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి):ఈ నెల 28న ఎన్ఆర్ఈజీఎస్ 15వ విడుత ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో ఆడిట్ నిర్వహిస్తున్నారు. 22 గ్రామ పంచాయతీలు, 26 హాబిటేషన్‌లలో గత ఏడాది ఉపాధి కూలీలు 385 రకాల పనులు చేపట్టారు. అందు కోసం ఉపాధి కూలీల వేతనాల కింద 4,52,80,182 రూపాయలు కాగా మెటీరియల్ కోసం రూ.1,0882158 ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 5,61,62,310 రూపాయలపై 28న మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సామాజిక ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కన్నెపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలువురు లబ్ధిదారులకు గురువారం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామాంజనేయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ ఓడ్డేటి హన్మంతు, మాజీ వైస్ ఎంపీపీ రాకేష్ శర్మ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, నాయకులు అంకూస్, చంద్రయ్య, శ్రీనివాస్, వెంకటేష్, సుధీర్, సురేష్, బానేష్, వెంకటి, జలపతి, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోటపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండంపేట, సూపాక (కె), అర్జునగుట్ట ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ బోధనకై ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి సీహెచ్ మొగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఆయా పోస్టుకు 7వ తరగతి పాసై ఉండి 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన మహిళలు మాత్రమే ఈ నెల 23లోగా కోటపల్లి ఎంఆర్‌సీలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

భీమారం : ప్రీ ప్రైమరీ పాఠశాల్లోని విద్యార్థులకు బోధించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో గోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పోతనపల్లి, మద్దికల్ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ బోధించేందుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని, అదే గ్రామానికి చెందిన వారై 18 నుంచి 44 సంవత్సరాలు ఉండాలన్నారు. ఈ నెల 25లోగా ఆయా పాఠశాలల్లో దరఖాస్తులను అందజేయాలన్నారు.

బసవన్నల పండుగ..



- జిల్లా సంస్కృతికి అద్దం పట్టే వేడుక
- ఘనంగా జరుపుకోనున్న రైతన్నలు
- రేపు పొలాల అమావాస్య

నస్పూర్/నెన్నెల ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రేమతో నిమిరితే మూగగా చూస్తాయి. కాడి కట్టగానే దుక్కి దున్నుతాయి. కరువొచ్చినా.. కాలం కాకపోయిన కలిసి బతుకుతాయి. అన్నదాతకు సాగులో తోడుండే అలాంటి మూగజీవాలను కొలిచే అరుదైన పండగ పొలాల అమావాస్య. మన జిల్లా సంస్కృతి, సంప్రదాయాలకు పొలాల అద్దంపడుతుంది. ప్రతిఏడు శ్రావణ మాసంలో చివరి రోజున వచ్చే అమావాస్యను పొలాల అమావాస్యగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం పొలాల పండుగ జరుపుకోనున్నారు. ఆ రోజు పల్లెల్లో సందడే సందడి కనిపిస్తుంది.

● మన సంస్కృతి... మన పండగ

జిల్లా సంస్కృతిని ప్రతిబింబించే ఈ పండుగను జిల్లా నలు మూలల ఉత్సవంగా జరుపుతారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఈ పండుగను మన జిల్లా అంతటా వైభవంగా జరుపుకుంటారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో జరుపుకునే 'పోలా'ను సరిహద్దులోని మన జిల్లాలో 'పొలాల'గ జరుపుకుంటారు. నాడు ఈ ప్రాంతాన్ని మహారాష్ట్రలోని చాందా (చంద్రపూర్) కేంద్రంగా గోండు రాజులు పాలించే వారు. కొన్నాళ్ల తరువాత విడిపోయిన ప్పటికీ... మరాఠ సంస్కృతి, సంప్రదాయాలను ఇక్కడి ప్రజలు అట్టిపెట్టుకునే ఉన్నారు. మరాఠి మాట్లాడటం, పోలాల, తీజ్ లాంటి పండుగలను జరుపుకోవడం కొనసాగుతూనే ఉంది.

● ప్రత్యేక పూజలు

ఆరుగాలం శ్రమించే రైతులకు బాసటగా నిలిచే ఎడ్లకు పూజలు చేసే పోలాల అమావాస్య వేడుకలు జిల్లాలో కోలాహలంగా సాగుతాయి. అన్నదాతలు ఈ పండుగ కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తుంటారు. పోలాల రోజు ఎద్దులకు ఎలాంటి పనులు చెప్పకుండా... భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఎడ్లను శుభ్రంగా కడిగి వాటిని అందంగా అలంకరిస్తారు. పూల దండలు, పరిలు, గజ్జెలు, కొత్త కన్నాలతో ముస్తాబు చేసిన బసవన్నలను స్థానిక అంజనేయ స్వామి ఆలయానికి తీసుకెళ్తారు. గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని దైవాన్ని రైతులు వేడుకుంటారు. ఎడ్లతో గుడి చుట్టు ప్రదక్షిణలు చేపిస్తారు. సాయంత్రానికి గ్రామాల్లో ఎద్దులను ఊరేగిస్తారు. అనంతరం ఇంటికి తీసుకువచ్చి హారతి ఇస్తారు. కొబ్బరికాయ కొట్టి... పిండి వంటకాలతో కూడిన నైవేద్యాన్ని సమర్పింకుంటారు. మరుసటి రోజు రైతులు తమ ఇళ్లల్లో మట్టితో చేసిన ఎద్దుల ప్రతిమలు పెట్టుకుని పూజిస్తారు. రైతులే కాకుండా వ్యవసాయేతర కుటుంబాలు సైతం ఈ పూజల్లో పాల్గొంటాయి.

బడుగ రోజు సందడే సందడి...

గ్రామీణ ప్రజలు శ్రావణమాసంలో భక్తిశ్రద్ధలతో గడుపుతారు. శ్రావన మాసంలో మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. శ్రావన సోమ, శనివారాలు నిష్టగా ఉపవాసాలు ఉంటారు. పొలాల అమావాస్య నుంచి వారు శ్రావనమాసంలో విధించుకున్న నియమ నిబంధనలు ముగుస్తాయి. పొలాల మరుసటి రోజైన బడుగ నుంచి మాంసాహారం తినడం ప్రారంభిస్తారు. బడుగ కోసం వాడ కట్టలో పది, పదిహేను మంది కలిసి మేకలు కోసుకుని పోగులు వేసుకుంటారు. మరికొందరు కోళ్లు కోసుకుంటారు.

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

బెల్లంపల్లి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న హైదరాబాద్‌లో చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. చక్రపాణి, రాజవేణులు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. పీఆర్‌సీని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉపాధ్యాయ రంగాల సమస్యల పరిష్కారాలకు పలుమార్లు మంత్రులకు వినతిపత్రాలు అందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కరించడం లేదన్నారు. రాష్ట్ర స్థాయి మహా ధర్నాకు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెన్నెల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గంగారం, మెట్‌పల్లి ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి లభించిందని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వాటిలో పనిచేసేందుకు అంగన్‌వాడీ ఇన్‌స్ట్రక్టర్స్ ఆయా పోస్టుల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇన్‌స్ట్రక్టర్‌కు ఇంటర్మీడియట్, ఆయా పోస్టుకు ఏడవ తరగతి చదివిన వారు అర్హులని చెప్పారు. 18 ఏళ్ల నిండి 44 ఏళ్ల లోపు వయసుల కలిగి ఉండి, స్థానికులై ఉండాలన్నారు. ధృవీకరణ పత్రాలతో ఈ నెల 25 ఉదయం 10 గంటల లోగా ఆయా స్కూల్స్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఎంఈవో కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బెల్లంపల్లి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన సుబ్రతో ముఖర్జీ ఫుట్‌బాల్ పోటీల్లో బెల్లంపల్లి సీఓఈ బాయ్స్ విజయం సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌సాగర్ తెలిపారు. జిల్లా స్థాయి అండర్-15, 17 పోటీల్లో మొదటి స్థానంలో బెల్లంపల్లి సీఓఈ బాలుర జట్టు విజయం సాధించిందని దీంతో రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ద్వితీయ స్థానంలో కోటపల్లిలోని టీజీఎస్ విద్యార్థులు కైవసం చేసుకున్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పీడీ రవి, ఎండీ చాంద్‌పాషా, నిర్వాహకులు అల్లూరి వామన్‌లతో పాటు పీఈటీలు సన్మానించారు.

ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ అందజేత

చెన్నూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని 11వ వార్డు కుమ్మరిగూడ వీధిలో సర్వర్ ఉన్నీసా బేగంకు గురువారం ఇందిరమ్మ ఇల్లు మంజూరు ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంత్రి వివేక్‌వెంకటస్వామికి, కలెక్టర్ కుమార్ దీపక్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి మల్లక్క, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వేమనపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లెంపల్లి, ముక్కిడిగూడెం గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బంది వైద్య శిబిరాలను నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. జ్వర పీడితుల నుంచి రక్తనమూనాలను సేకరించారు. గర్భిణులకు పరీక్షలు చేసి తగు సూచనలు చేశారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటికి వేడి చేసి చల్లార్చి తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, రాజ్యలక్ష్మీ, ఏఎన్ఎం సరిత, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సత్కారం

జన్నారం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న మేకల లావణ్య ఈ నెల 15న కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో గ్రామస్తులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మల్లీఖార్జున్, శంకర్ మాట్లాడుతూ విధుల పట్ల శ్రద్ధతో పని చేస్తే ఎప్పటికైన గుర్తింపు లభిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు గంగాధర్, శివాజీ, ప్రదీప్, రత్నం, రాజమౌళి, వెంకట్, పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బెల్లంపల్లి ఎమ్మెల్యే పీఏల హల్‌చల్

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు

బెల్లంపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏలు, కాంగ్రెస్ నాయకులు జాతీయ రహదారిపై మద్యం సేవిస్తూ నృత్యాలు చేసిన వీడియోలు గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బెల్లంపల్లిలోని కెమికల్ ఏరియా జాతీయ రహదారిపై రాత్రి సమయంలో ఎమ్మెల్యే వినోద్ పీఏలు, డ్రైవర్ మోసిన్, శేఖర్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు రహదారిపై కారు నిలిపి డ్యాన్స్‌లు చేశారు. బీర్లు తాగుతూ డ్యాన్స్‌లు చేస్తూ కేరింతలు కొడుతూ చిందులు వేశారు.

అయితే ఈ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. జాతీయ రహదారిపై బహిరంగంగా మద్యం తాగుతూ వాహనదారులకు ఇబ్బందులు కలిగించిన ఆ వీడియోల ఆధారంగా ఇప్పటికైనా పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలంటూ సోషల్‌మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. వైరల్ అవుతున్న ఈ వీడియోపై పోలీసు అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

వైన్ షాపుల టెండర్లకు నోటిఫికేషన్..

(5వ పేజీ తరువాయి)

రుసుమును ఆరు వాయిదాల పద్ధతులో చెల్లించాల్సి ఉండగా, జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజును స్లాబుల వారీగా చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్సు ఫీజును గత మద్యం పాలసీ ప్రకారం 5వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో మొత్తం 17 షాపులు కేటాయించగా ఒక్కో దుకాణానికి యేడాదికి రూ. 50 లక్షలుగా నిర్ణయించారు. 5 వేల నుంచి 50వేల జనాభా గల పట్టణాల్లో 17 షాపులు ఉండగా సాలుసరి ఫీజు రూ. 55 లక్షలు, 50వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో 38 షాపులు ఉండగా రూ. 60 లక్షలు సాలుసరి లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

అయితే ఒక్క జైపూర్ మండలం ఇందారంలో ఒక షాపు ఉండగా, ఇక్కడ మాత్రం గరిష్టంగా సాలుసరి లైసెన్సు ఫీజు రూ. 65 లక్షలు నిర్ణ యించారు. ఇక్కడ 5 వేల లోపు జనాభా ఉన్నప్పటికీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 5 కిలో మీటర్ల లోపు పెరిఫెరి ఉన్నందున ఇక్కడ రూ. 5 లక్షలు అదనపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది కూడా అదే మాదిరిగా ఫీజుల చెల్లింపు ఉండే అవకాశం ఉంది.

టీఎల్ఎం ప్రదర్శన

కన్నెపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో గురువారం టీఎల్ఎం ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుకు రెండు అంశాలను ప్రదర్శించారు. ఇందులో గెలుపొందిన ఉపాధ్యాయులకు ఎంఈవో రాము బహుమతులు అందించారు. ఉపాధ్యాయులను జిల్లా స్థాయి టీ ఎల్ఎం ప్రదర్శనకు పంపిస్తామని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ ఎం రమేష్, కాంగ్రెస్ నాయకుడు నర్సింగ రావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పించడమే లక్ష్యం

మంచిర్యాల షీ టీమ్ ఎస్సై హైమ

దండేపల్లి(లక్షెట్టిపేట) ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, షీ టీమ్ మహిళలకు, విద్యార్థినులకు తోడుగా మరింత భద్రత ఉంటుందని మంచిర్యాల షీ టీమ్ ఎస్సై హైమ అన్నారు. లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం షీటీమ్ ఆధ్వర్యంలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళల భద్రత కోసం పోలీసులతో పాటు ప్రతీ ఒక్క పౌరుడు బాధ్యత తీసుకోని వారికి భరోసాగా ఉండాలన్నారు. ఎవరైన వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా వెంటనే షీ టీమ్ 6303923700కు ఫోన్ చేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింక్‌లను ఫోన్‌లో ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ నేరస్థుల పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలుకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పలు చట్టాలపై వారికి వివరించారు. కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు జ్యోతి, శ్రావణ్, సతీష్, కాలేజి ప్రిన్సిపల్ లక్ష్మణ్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో చట్టాలపై వివరిస్తున్న షీ టీమ్ ఎస్సై హైమ

పల్లెల్లో ఇక పనుల జాతర

-ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు

-జిల్లా వ్యాప్తంగా నేడు ప్రారంభోత్సవాలు

నెన్నెల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక పల్లెలో పనుల జాతర సాగనుంది. గ్రామగ్రామాన పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. కొత్త పనులను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారు. గతంలో పూర్తి చేసిన పనులను ప్రారంభించి, కొత్త పనులకు భూమిపూజలు చేయనున్నారు. ఈకార్యక్రమాన్ని పండగలా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణా భివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో ఉపాధిహామి, స్వచ్ఛభారత్ మిషన్, పంచాయతిరాజ్, ఇంజనీరింగ్, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖలు పనులు చేపడతాయి. శనివారం నుంచి పనులు కొనసాగుతాయి. ఈ పనులను 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

చేపట్టే పనులు ఇవే..

గ్రామీణ రహదారులు, అవసరమైన చోట నూతన పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్లు, సెగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సుల నిర్మాణం చేపట్టనున్నారు.

పత్రాలు అందించి.. సన్మానించి..

ఇందిరా మహిళా శక్తి-ఉపాధి భరోసా కింద చేపట్టే జీవనోపాధి కార్యక్రమాలు, మహిళా సంఘాలకు కోళ్లు, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి మంజూరి పత్రాలు అందివ్వనున్నారు. ఈత, తాటి చెట్ల పెంపకం, పండ్ల తోటల పెంపకానికి రైతులను ఎంపిక చేసి పత్రాలు అందజేస్తారు. జలనిధి కింద భూగర్భ జలాల పెంపునకు కృషి చేసిన వారికి, గత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ రోజులు ఉపాధి పనులకు హాజరైన దివ్యాంగులను, గ్రామ పంచాయతీల్లో నిబద్ధతతో పని చేసిన మల్టీపర్పస్ వర్కర్లను, పారిశుధ్య కార్మికులను సన్మానించనున్నారు.

ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి

జన్నారం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలం కేంద్రంలోని ప్రధాన రహదారులపై నిత్యం ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐ అనూషకు ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారులపై ఆవులు, గేదెలు ఇష్టానుసారంగా తిరుగుతున్నాయని రోడ్లపైనే తిష్టవేయడంతో రాత్రి పూట వాహనాల ద్వారా వెళ్లే వారికి కనబడ కపోవడం తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని ద్విచక్ర వాహనదారు లైతే పలుమార్లు తీవ్ర గాయాలపై మృత్యువాత పడ్డ సంఘటనలు ఉన్నాయన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్ఎస్‌యుఐ నాయకులు వినీత్, రఘు, రాకేశ్, సుమిత్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

వేమనపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి మండల కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదినవేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, రజాక్, సంతోష్, రవీందర్, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దండేపల్లి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, టీబి వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని టీబి ప్రోగామ్ అధికారి డాక్టర్ సుదాకర్‌నాయక్, స్థానిక వైద్యుడు సతీష్‌లు అన్నారు. గురువారం మండలంలోని చింతపల్లిలో దండేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో టీబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం టీబి వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి వాటి నివారణ చర్యలపై వివరించారు. వారు మా ట్లాడుతూ వ్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వైద్య చికిత్సలు చేయిం చుకోవాలన్నారు. ఏవైనా వ్యాధి లక్షణాలు ఉంటే సంబంధిత వైద్య సి బ్బందికి తెలియజేస్తే వారు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అనంత రం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి పలు వురి రక్తనమూలను సేకరించారు. కార్యక్రమంలో వైద్యులు గౌరీ శంక ర్, టీబి సూపర్‌వైజర్ల సురేష్, అంజన్న, సీహెచ్‌వో రాజిరెడ్డి, సూపర్ వైజర్ల వసంతకుమారి, ఎంఎల్‌హెచ్‌పి రాధిక, మనీష, ఏఎన్ఎం పా ర్వతి, ఆశకార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.



చింతపల్లిలో టీబీ వ్యాధి పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు సుధాకర్‌నాయక్ సతీష్

గణపతి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, మత, పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండపాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకున్న తర్వాతనే ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద నిబంధనలు పాటించాలని, భక్తి గీతాలను వేయాలని సూచించారు. డీజే సౌండ్ పెట్టవద్దన్నారు. మండపాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసులకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

తాండూర్ : వినాయక చవితి సందర్భంగా గణపతి మండపాలను ఏర్పాటు చేసే నిర్వహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తాండూర్ సీఐ దేవయ్య సూచించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనుమతి పొందిన తర్వాత నే మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మండపాలకు విద్యుత్‌ను సంబంధిత శాఖ అనుమతి తీసుకుని ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద ఇద్దరు వలంటీర్లు 24 గంటలు ఉండాలన్నారు. మండపాల వద్ద అనుమానస్పదంగా బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. పండగను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఎస్ఐ కిరణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, విద్యుత్ ఏఈ జాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

కన్నెపల్లి : మండలంలో వినాయక మండపాలను ఏర్పాటు చేసే వారు పోలీసుల అనుమతి తీసుకోవాలని కన్నెపల్లి ఎస్ఐ భాస్కర్‌రావు సూచించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమతి తీసుకున్న తర్వాతనే మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

డీజే వాడితే చర్యలుంటాయన్నారు. మండపాల వద్ద ఏమైనా అనుమాన వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింగరావు, పోలీసులు , మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

నెన్నెల : గణేష్ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ హనోక్ కోరారు. ఎస్సై ప్రసాద్‌తో కలిసి గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండపాల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. మండపాల ఏర్పాటుకు తప్పకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విగ్రహం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు, నిమజ్జనం తేది తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. డీజే ఏర్పాటు చేయడం నిషేదమన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున విద్యుత్ తీగలను గనిస్తూ ముందు జాగ్రత్తలు తీసుకుంటూ యాత్ర నిర్వహించుకోవాలని సీఐ వివరించారు.

నేటి నుంచి పల్లెల్లో పనుల జాతర





ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేటి నుంచి పనుల జాతర-2025 కార్యక్రమం చేపట్టేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ఏర్పాట్లు సిద్ధం చేశాయి. ఉపాధిహామీ పథకంతో పాటు వాటర్‌షెడ్ పథకం, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, స్వచ్ఛ భారత్ వంటి విభాగాల్లో చేపట్టిన, చేపట్టనున్న పనులకు ప్రారంభోత్సవాలు, భూమి పూజలు నిర్వహించనున్నారు.

● **జిల్లాలో 951 పనులు..**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 పంచాయతీలు ఉన్నాయి. కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశాల మేరకు పనుల జాతర-2025 నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్‌డీవో దత్తరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 951 పనులకు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు చేయనున్నారు. ప్రారంభోత్సవాలకు స్థానిక ఎంపీతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. పనుల జాతరలో భాగంగా నూతన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను చేపట్టనున్నారు. ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా కింద వ్యక్తిగత ఆస్తుల కల్పన పనులైన పశువుల కొట్టం, కోళ్ల, గొర్రెల షెడ్లు, పండ్ల తోటలు, జలనిధి పథకం కింద వాన నీటి సంరక్షణ, భూగర్భ జలాలు పెంచే ఫారం పాండ్స్, ఊట కుంటలు వంటి పనులు ప్రారంభించనున్నారు. లబ్ధిదారులను గుర్తించి గ్రామసభల్లో మంజూరు ఉత్తర్వులు అందించనున్నారు. అలాగే ఉపాధిహామీ పథకంలో ఎక్కువ రోజులు పని చేసిన కూలీలతో పాటు దివ్యాంగులు, పారిశుధ్య కార్మికులు, హరిత సంరక్షకులను సన్మానించనున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



పార్టీ కండువా కప్పుతున్న కేటీఆర్

కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు వైఖరికి నిరసనగా ఆ పార్టీకి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర సభ్యుడు గోలేం వెంకటేష్‌తో పాటు పలువురు నాయకులు పార్టీకి రాజీనామా చేసి గురువారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ వీరికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి అంతా కృషి చేయాలని మాజీ మంత్రి సూచించారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, సిర్పూరు బీఆర్‌ఎస్ పార్టీ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, అర్షద్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్ మినాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలో 41 పాఠశాలల్లో పూర్వప్రాథమిక తరగతులు నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతించందని జిల్లా విద్యాధికారి దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు తెలిపారు. ఈ పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిన ఈ విద్యాసంవత్సరం పని చేసేందుకు అర్హత కలిగిన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈనెల 25లోగా ఎంపిక చేసిన 41 పాఠశాలల్లో అందజేయాలని ఆయన సూచించారు.



మద్యం టెండర్లకు వేళాయె..

- 2025-27 సంవత్సరాలకు గాను మద్యం దుకాణాల లైసెన్సుల జారీకి అధికారుల కసరత్తు
- త్వరలోనే టెండర్, లక్కీడ్రా, తేదీలను ఖరారు చేయనున్న ప్రభుత్వం
- ఈ సారి దరఖాస్తు ఫీజును రూ. మూడు లక్షలకు పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం
- డిసెంబరు 1 నుంచి అమలు కానున్న కొత్త మద్యం పాలసీ

చింతలమానేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 2025-27 కొత్త మద్యం పాలసీని.. అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఏ-4 లిక్కర్ షాపుల జారీకి ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో వైన్‌షాపుల టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇదివరకే కొనసాగుతున్న 2023-25 మద్యం పాలసీ నవంబరు 30, 2025తో ముగిసిపోనుంది. ఈలోపు దరఖాస్తులు, టెండర్లు, లక్కీ డ్రా ప్రక్రియను పూర్తిచేసేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు సిద్ధం అవుతున్నారు. జిల్లాలో మొత్తం 32 మద్యం షాపులుండగా.. ఇందులో 28 మైదాన ప్రాంతాల్లో, నాలుగు ఏజెన్సీ పరిధిలో ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఈసారి కూడా లిక్కర్ వ్యాపారులు మద్యం దుకాణా లను దక్కించుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. కొంత మంది వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు చేసేందుకు సిద్ధం అవుతు న్నారు. ఒక వ్యక్తి ఎన్ని మద్యం షాపులకైనా దరఖాస్తు చేసుకునేలా వెసులుబాటు ఉంటుంది. త్వరలోనే దరఖాస్తుల ప్రక్రియతో పాటు టెండర్లు, లక్కీడ్రా నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేసే అవకాశంఉందని అధికారులు పేర్కొంటున్నారు.

● **దరఖాస్తు ఫీజు రూ. మూడు లక్షలు..**

2025-27 మద్యం పాలసీలో భాగంగా టెండర్ల దరఖాస్తు ఫీజును మూడు లక్షల రూపాయలకు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో 2023-25 మద్యం పాలసీలో లైసెన్సు ఫీజుగా రెండు లక్షల రూపాయలను వసూలు చేశారు. ఈ సారి మరో లక్ష రూపాయలను పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాగే జనాభా ప్రాతిపదికన లైసెన్సు ఫీజును నిర్ణయించారు. ఐదు వేల జనాభా వరకు 50 లక్షల రూపాయలు, ఐదు వేల నుంచి 50 వేల జనాభా ఉన్న షాపులకు 55లక్షల రూపా యలు, 50 వేల నుంచి లక్ష వరకు 60లక్షల రూపాయలు, లక్ష నుంచి ఐదు లక్షల జనాభా వరకు 65లక్షల రూపాయలు, ఐదు లక్షల నుంచి 20లక్షల జనాభా వరకు 85 లక్షల రూపాయలు, 20 లక్షలకు పైబడిన జనాభా ఉన్న మద్యం షాపులకు కోటి పది లక్షల రూపాయలను లైసెన్సు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే దరఖాస్తు చేసుకునేందుకు 21 ఏళ్ల నిండిన వారు మాత్రమే అర్హులని అధికారులు చెబుతున్నారు.

● **రిజర్వేషన్లు యథావిధిగా..:**

గతంలో మాదిరిగానే మద్యం షాపుల రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో మొత్తం 32 మద్యం షాపులుండగా నాలుగు షాపులు ఏజెన్సీ ప్రాంతంలో అలాగే 28 షాపులు మైదాన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు. అయితే ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే మద్యం షాపులు పూర్తిగా ఆదివాసులు, గిరిజనులకు కేటాయిస్తుండగా, 28 షాపులు రిజర్వేషన్ల పద్ధతిలో కేటాయిస్తారు. గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తారు. దీని ప్రకారం మైదాన ప్రాంతంలోని మద్యం దుకాణాలకు లక్కీడ్రా నిర్వహిస్తారు. రిజర్వేషన్ల దుకాణాలపై బినామీలు కన్నేసి దక్కించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. చాలా చోట్ల లక్షల రూపాయలు ముట్టజెప్పి లక్కీడ్రాలో గెలుచుకున్న వారి వద్ద బినామీలు లాగేసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

● **నవంబరు 30 వరకు చివరి గడువు..**

ఇప్పటికే మద్యం దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులకు నవంబరు 30, 2025ను చివరి గడువుగా విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల్లోగా టెండర్, లక్కీ డ్రా ప్రక్రియను పూర్తి చేసి కొత్తగా ఏ-4 మద్యం దుకాణాలను దక్కించుకున్న వారికి లైసెన్సులు జారీ చేస్తారు. తర్వాత డిసెంబరు 1 నుంచి మద్యం విక్రయాలను అనుమతిస్తారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ముందస్తుగా నోటిఫికేషన్ జారీ చేయడంతో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు.

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు..

- జ్యోతి కిరణ్, జిల్లా ఎక్సైజ్ అధికారి

ప్రభుత్వం ఏ-4 మద్యం దుకాణాల లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తులు, టెండర్లు, లక్కీడ్రా తేదీలు ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది దరఖాస్తు ఫీజు మాత్రం లక్ష రూపాయలు పెంచి మూడు లక్షల రూపాయలుగా నిర్ణయించారు. ఒక్క వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ దరఖాస్తుకు మాత్రం మూడు లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

పోడు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి



దీక్షకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పోడు సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటన జారీ చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు. గురువారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు చేస్తున్న నిరవధిక నిరహార దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికి మాట్లాడారు. అటవీ శాఖ అధికారులు పోడు రైతులపై తరుచూ కేసులు పెడుతున్నారన్నారు. గత ప్రభుత్వం కూడా 40వేల ఎకరాలు పోడు రైతులకు పట్టాలిస్తామని చెప్పి కేవలం నాలుగువేల ఎకరాలకు పట్టాలిస్తామని చెప్పి చేతులు దులుపుకున్నట్టు వివరించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలన్నారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి లేదన్నారు. జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి పర్యటించినా కనీసం తన దీక్ష విషయంపై స్పందించపోడం వారి చిత్తశుద్ధికి నిదర్శంగా ఉందన్నారు. సమావేశంలో మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులు కొయ్యల ఏమాజీ ముకేష్ గౌడ్, తిరుపతి, అంజనేయులు, గోవర్ధన్, సంతోష్, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్షీణిస్తున్న ఎమ్మెల్యే ఆరోగ్యం

జీవో నంబర్ 49 రద్దు చేయాలని నాలుగు రోజులుగా నిరవధి నిరాహార చేస్తున్న కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాలాయి హరీష్ బాబు ఆరోగ్యం క్షీణిస్తోంది. కాగజ్‌నగర్ ప్రభుత్వాస్పత్రి వైద్యుడు డాక్టర్ శ్రీధర్‌బాబు గురువారం పరీక్షలు నిర్వహించారు. కాగా ఎమ్మెల్యే షుగర్ లెవెల్స్ పడిపోవడంతో బీజేపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ కౌన్సిలర్లు సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు పరిస్థితి బాగాలేదని, రాష్ట్ర ప్రభుత్వం జీవోనంబర్ 49ని వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణ బంద్‌కు పిలుపునిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

రోడ్డు పనుల పరిశీలన

కాగజ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ భట్టుపల్లి ప్రధాన రోడ్డు గుంతల మయం కావటంతో సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో మరమ్మతులు పనులను మూడు రోజులుగా చేపట్టారు. గురువారం ఈ పనులను స్వయంగా మాజీ ఎమ్మె ల్యే పరిశీలించారు. ఈయన వెంట స్థానిక నాయులున్నారు

నాణ్యమైన విద్య అందించాలి

సిర్పూర్(యు), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు.గురువారం మండలంలోని పంగడి ఆశ్రమోన్నత పాఠశాలను ఎంపీడీవో తనిఖీ చేశారు. తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజన వసతి కల్పించాలన్నారు. మేను ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు మెస్రం మోతిరాం, మెస్రం నాగోరావు ఉన్నారు.

పనిభారం తగ్గించండి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఐకేపీ వీవోఏలకు పనిభారం తగ్గించాలని కోరుతూ డీపీఎం నరేందర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఐకేపీ వెలుగులో క్షేత్రస్థాయి లో పనిచేస్తున్న గ్రామ సమాఖ్య సంఘం అసిస్టెంట్‌లు తెలంగాణ సెర్ప్ సంస్థలో మొత్తం 67 రకాల పనులు చేయించుకొంటున్నారని వాపోయారు. వీవోఏలు బుద్దు, సుదర్శన్, వినోద్, శ్రీధర్, జుగాదిరావు, జవంత్‌రావు, సరిత, శారద పాల్గొన్నారు.

డబ్బులు ఆలయానికి చెల్లించాలి

దహెగాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని పాత దహెగాం అంజన్న దేవాలయం డబ్బులను దేవునికే చెందాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. అంజన్న దేవుడి ఆలయం పేరిట 13.5 ఎకరాల భూమి ఉండగా 2013లో అయిదు ఎకరాల భూమి ప్రాణహిత- చేవెళ్ల కాలువలో పోవడంతో వచ్చిన పరిహారం డబ్బులు దేవుడి ఖాతాలో ఉండాల్సి ఉండగా శివాలయానికి ఖర్చు చేసినట్లు చూపిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోర్టు కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజు, జూనియర్‌సివిల్ జడ్జి అనంత లక్ష్మితో కలిసి పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ వచ్చే నెల 13న నిర్వహించే లోక్ అదాలత్‌కు ఎక్కువ రాజీ కేసులు వచ్చేలా చూడాలన్నారు. రాజీ పడదగ క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకు, ఎలక్ట్రిసిటి, భూ తగాద, వివాహ, కుటుంబ తగాదాల, మోటారు వెహికల్ యాక్సిడెంట్, చిట్‌ఫండ్, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించబడుతాయని కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాల ని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజ న్, డీఎస్పీ రామానుజన్, ఇతర పోలీసు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి: కలెక్టర్



విద్యార్థితో పాఠం చదివిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, వంటశాల, భోజన నాణ్యత, విద్యాబోధన విధానం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో గుణాత్మక విద్యను బోధిం చాలని ముఖ్యంగా ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. వచ్చే నెల నాటికి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పురోగతి లేకుంటే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

సంక్షేమ ఫలాలు గిరిజనులకు అందించాలి

ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు జిల్లాలో అర్హులైన గిరిజనులకు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో దర్తీ అభజన జాతీయ గ్రామీణ ఉత్కర్ష అభియాన్‌లో ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా బ్లాక్ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

పండగసుల ప్రజలందరు సమన్వయంతో శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్ రావులతో కలిసి గణపతి నవరాత్రులు, మిలాద్ ఉన్ నబి వేడుకల నిర్వహణపై పోలీసు, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, మసీద్ కమిటీ ప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తామని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

● నకిలీ పత్తి మందులను అమ్మిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆసిఫాబాద్ మండలంలోని గొల్లగూడకు చెందిన రుకుం సాంబయ్య అనే రైతు వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు.

● సిటీవ్యాలీలోని మౌంట్ కనామో శిఖరాన్ని అధిరోహించిన కెరమెరి మండలం కేలికి చెందిన పర్వతరోహకుడు జిట్టే కార్తీక్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభినందించారు.

జైనూర్: ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికైన ఆడ బీర్షావ్‌కు ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు.

● పరమ హంస సద్గురు పుల్లాజీబాబ 101వ జన్మదిన వాల్ పోస్టర్లను గురువారం మార్కెట్ కమిటి చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్‌లు విడుదల చేశారు.

కౌటాల: పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉపాధిహామి పనులను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించాలని ఎంపీడీవో ప్రసాద్ అధికారులకు సూచించారు.

● పోడు రైతుల సమస్యల పరిష్కారం కోసం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మద్దతుగా కౌటాల మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఒక రోజు మద్దతు దీక్ష చేపట్టారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండలం ఈసుగాం ఎస్సీ కాలనీలో పారిశుద్యం పనులు వెంటనే చేపట్టాలని కాలనీ వాసులు ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఉట్నూర్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎండీ గౌస్ తెలిపారు. హౌజ్ వైరింగ్, సెల్‌ఫోన్ రిపేర్, ఫొటోగ్రఫీ, ఫ్రిడ్జ్, ఏసీ రిపేరింగ్, టూ వీలర్ రిపేరింగ్, సీసీటీవీ ఇన్‌స్టాలేషన్ కోసం శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పదవ తరగతి చదివి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగితా వివరాలకు 9949412159, 8985633226ను సంప్రదించాలన్నారు.

సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వీసీ హాల్ నుంచి ఎంపీడీవో, ఎంపీవో, కార్యదర్శులు, ఏపీవోలు, ఏపీఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల వల్ల గ్రామాల్లో వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి శిబిరాలు నిర్వహించాలని, అవసరమైన చర్యలు చేట్టాలన్నారు. దెబ్బతిన్న రహదారుల, కల్వర్టులు వెంటనే మమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్సీ



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత నదికి వచ్చిన వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండలంలోని ప్రాణహిత తీర గ్రామాలైన తలాయి, భీమారం, తిక్కపల్లి, పాపన్నపేట, సోమిని తదితర గ్రామాల్లో నీట మునిగి నష్ట పోయిన పత్తి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట నష్ట పోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రాణహిత తీర ప్రాంతంలో నీట మునిగిన పంట నష్ట పోయిన రైతుల భూములను సర్వేలు చేసి రైతులకు నష్టం కలగకుండా చూడాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి నాగరాజు, నాయకులు శ్రీవర్ధన్, విశ్వేశ్వర్‌రావు, జగ్గాగౌడ్, రాజన్న, నాహిర్ అలీ, సురేష్‌గౌడ్, హకీం తదితరులు ఉన్నారు.

ప్రధాన కాలువకు పొంచి ఉన్న ముప్పు



కోతకు గురైన ప్రధాన కాలువ గట్టు

దహెగాం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం కల్వాడ గ్రామ సమీపంలోని పాల్వాయి పురుషోత్తమరావు ప్రాజెక్టు ప్రధాన కాలువకు ముప్పు పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన కాలువ కోతకు గురైంది. ప్రధాన కాలువ కింద 9 వేల ఎకరాల ఆయకట్టు భూమి సాగువుతుంది. ప్రతియేటా వర్షాకాలంలో కుంచవెల్లి సమీపం ప్రధాన కాలువకు గండి పడుతుంది. చంద్రపల్లి, పీకలగుండం, బామానగర్, ఒడ్డుగూడ, బ్రాహ్మణ్‌చిచ్వాల తదితర గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్న వరి పొలాలకు సాగునీరు అందుతుంది. ప్రధాన కాలువకు గండి పడకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రధాన కాలువకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. .

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి గురు వారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉంటుందన్నారు. నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి